క్లుప్తంగా

ఇచ్చిన హామీలు అమలు చేస్తున్నాం



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

గోదావరిఖనిటౌన్: గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని ఐఎన్‌టీయూసీ సెంట్రల్ కమిటీ వైస్ ప్రెసిడెంట్ పి.ధర్మపురి అన్నారు. గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. టీబీజీకేఎస్ నాయకులు మిర్యాల రాజిరెడ్డి చేసిన ఆరోపణలను ఐఎన్‌టీయూసీ ఖండిస్తోందన్నారు. కార్మికుల సొంతింటి కలపై యూనియన్ సెక్రటరీ జనరల్ జనక్‌ప్రసాద్ ఆధ్వర్యంలో కమిటీ వేశామన్నారు. అలాగే యూనియన్ ఇచ్చిన హామీలో భాగంగా సింగరేణి ప్రైవేటీకరణను అడ్డుకుంటున్నట్లు తెలిపారు. నాయకులు కె.సదానందం, వి.లక్ష్మిపతిగౌడ్, వడ్డేపల్లి దాస్, గడ్డం కృష్ణ, జి.శ్రీనివాస్, విజయ్‌మోహన్, ఎ.నవీన్‌కుమార్, ఆంజనేయులు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ

పెద్దపల్లిరూరల్: ప్రతీఒక్కరు తమ ఇంటి ఆవరణతో పాటు వీధులను శుభ్రంగా ఉంచుకోవాలని కౌన్సిలర్ బొంకూరి భాగ్యలక్ష్మి అన్నారు. శుక్రవారం 8వ వార్డులో స్వచ్ఛ శుక్రవార్ కార్యక్రమంలో భాగంగా పారిశుధ్య పనులు చేపట్టారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా మున్సిపల్ పారిశుధ్య సిబ్బందికి అందించాలన్నారు. ప్లాస్టిక్ కవర్లు, చెత్తను రోడ్డుపై వేయొద్దని సూచించారు.

మోడల్ ఇందిరమ్మ ఇళ్ల కోసం స్థల పరిశీలన

సుల్తానాబాద్: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం వెనుక వైపున ఉన్న స్థలంలో మోడల్ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం స్థలాన్ని ఎంపీడీవో దివ్యదర్శన్‌రావు సందర్శించారు. స్థలాన్ని జిల్లా గ్రంథాలయం సంస్థ చైర్మన్ అన్నయ్యగౌడ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మినుపాల ప్రకాశ్‌రావు, ఏఈ సచిన్‌తో కలిసి శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే విజయరమణారావు ఆదేశాల మేరకు మోడల్ ఇందిరమ్మ ఇళ్ల స్థలం కోసం పరిశీలించినట్లు వివరించారు. ఇందిరమ్మ ఇల్లుకు 400 చదరపు గజాల స్థలం నిర్ణయించినట్లు పేర్కొన్నారు.

విద్యార్థులకు అభినందన



అభినందిస్తున్న ప్రిన్సిపాల్ శ్రీధర్‌రెడ్డి

రామగిరి: ఇటీవల వరంగల్‌లో నిర్వహించిన సీఎం కప్ రాష్ట్రస్థాయి ఖోఖో క్రీడల్లో ప్రతిభ కనబరిచిన జేఎన్‌టీయూ కళాశాల విద్యార్థులు జె.శ్రీకాంత్ (సివిల్ ఇంజనీరింగ్), ఎస్.అఖిల్(మైనింగ్ ఇంజనీరింగ్)ను శుక్రవారం కళాశాల ప్రిన్సిపాల్ చెరుకు శ్రీధర్‌రెడ్డి అభినందించారు. కార్యక్రమంలో కళాశాల ఫిజికల్ డైరెక్టర్లు పింగిలి కృష్ణారెడ్డి, సునీల్‌కుమార్‌గౌడ్, సుమన్‌రెడ్డి పాల్గొన్నారు.

మెడికల్ సీటు సాధించిన విద్యార్థికి సన్మానం



శ్రీజను అభినందిస్తున్న నాయకులు

రామగిరి: మండలంలోని నాగేపల్లి గ్రామానికి చెందిన మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పూదరి సత్యనారాయణ గౌడ్ కూతురు శ్రీజగౌడ్ కాకతీయ మెడికల్ కళాశాలలో మెడికల్ సీటు సాధించడంపై శుక్రవారం బీఆర్‌ఎస్ నాయకులు ఆమెను అభినందించి సన్మానించారు. మెడికల్ ఫలితాల్లో శ్రీజ 1081 ర్యాంక్‌తో కాకతీయ మెడికల్ కళాశాలలో ఆర్థోపెడిక్ విభాగంలో సీటు సాధించింది. పార్టీ నాయకులు కుమార్ యాదవ్, శంకేశ్ రవీందర్, భాస్కర్, శంకర్, ప్రసాద్, ఓదెలు, శ్రీదేవి, ఆశకుమారి, శ్రీనివాస్, శంకర్ ఉన్నారు.

నిజాయతీ చాటుకున్న శ్రీనివాస్

మంథని: మంథని బోయినిపేటకు చెందిన అట్టెం శ్రీనివాస్‌కు శుక్రవారం స్థానిక బస్టాండ్ వద్ద రూ.45,500 ఉన్న బ్యాగు దొరకగా పోలీసుల సాయంతో సదురు బ్యాగును పోగొట్టుకున్న వ్యక్తికి అప్పగించి నిజాయతీ చాటుకున్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా తాడిచర్లకు చెందిన తాండ్ర లక్ష్మన్ మంథని బస్టాండ్‌లో గ్రామానికి వెళ్లే తొందరలో తన బ్యాగును బస్టాండ్‌లో పోగొట్టుకొకున్నాడు. అదే సమయంలో టాటా ఏస్ వాహనం డ్రైవర్ అట్టెం శ్రీనివాస్‌కు ఆ బ్యాగ్ దొరకగా అతను పోలీసులకు అప్పగించాడు. బ్యాగు పోగొట్టుకున్న లక్ష్మన్‌కు అప్పగించారు. శ్రీనివాస్‌ను పలువురు అభినందించారు.

మూలమలుపులు ప్రమాదాలకు నెలవు



జూలపల్లి–కొత్తూరు మధ్య డీ–83 కెనాల్‌లో ట్రాక్టర్‌తో సహా పడి మృతి చెందిన వ్యక్తి (ఫైల్)

- కానరాని హెచ్చరిక బోర్డులు, వేగనిరోధకాలు
- ప్రమాదాలు జరుగుతున్నా.. పట్టించుకోని అధికారులు
- డేంజర్ జోన్‌గా కొత్తూరు–జూలపల్లి డి–83 కెనాల్ మలుపు

జూలపల్లి: మండల కేంద్రం నుంచి జిల్లా, ఉమ్మడి జిల్లా కేంద్రాలకు వెళ్లే రహదారులు అధ్వానంగా, మూలమలుపులతో ప్రమాదకరంగా మారాయి. మూల మలుపుల వద్ద వాహనదారులకు ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. మలుపులు మరీ దగ్గరగా ఉండడంతో ద్విచక్ర వాహనదారులు అదుపు తప్పుతున్నాయి. అధికారులు మూలమలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు, వేగ నిరోధకాలు ఏర్పాటు చేయకపోవడంతో మూలమలుపులు ప్రమాదాలకు నెలవుగా మారుతున్నాయి.

మండలంలో ఇలా..

మండల కేంద్రం నుంచి కొత్తూరు వెళ్లేదారిలో డి–83 కెనాల్ వద్ద అతి దగ్గరగా మలుపు ఉండడంతో, ఎదురెదురుగా వచ్చే వాహనాలు కనపడక ప్రమాదాలు జరుగుతున్నాయి. గతంలో ఇక్కడ ట్రాక్టర్ నేరుగా కాలువలోకి వెళ్లి డ్రైవర్ మృత్యువాత పడ్డాడు. అబ్బాపూర్‌కు చెందిన ఇద్దరు రైతులు బైక్‌లపై వెళ్తుండగా అదుపు తప్పి కాలువలో పడ్డారు. పెద్దాపూర్–జూలపల్లి మధ్య ఇదివరకే రెండుసార్లు వాహనాలు బోల్తా పడగా, ఒకరు చనిపోయారు. కాగా మరో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. మూలమలుపు వద్ద ద్విచక్రవాహనాలు జారిపడి వాహనదారులు గాయపడడారు. జూలపల్లి–బంజేరుపల్లి రోడ్డుకు ఐదారు స్థలాల్లో మూల మలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. జిల్లా కేంద్రానికి వెళ్లే రోడ్డుకు వడ్కాపూర్ వద్ద ప్రమాదకరంగా మలుపు ఉంది. ఇలా మండలంలోని చాలా రోడ్డు మార్గాల్లో మూల మలుపులతో ప్రమాదాలు జరుగుతున్నాయి. గతంలో అక్కడక్కడా యూత్ సభ్యులు, స్వచ్ఛంద సంస్థలు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసినా అవి కొన్ని రోజులు మాత్రమే ఉన్నాయి. ఎవరూ పట్టించుకోక పోవడంతో అవి శిథిలావస్థకు చేరి కనిపించకుండా పోయాయి. మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు, వేగనిరోధకాలు, సూచికలు ఏర్పాటు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.



జూలపల్లి–పెద్దాపూర్ మధ్య ప్రమాదకరంగా ఉన్న మూలమలుపు

బోర్డులు ఏర్పాటు చేయాలి



మండలానికి వచ్చే రోడ్లలో మూల మలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. వాహనదారులకు కనిపించేలా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి. ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలి.

– మేరుగు రమేశ్, జూలపల్లి

అధికారుల దృష్టికి తీసుకెళ్లిన



మండల కేంద్రం నుంచి జిల్లా కేంద్రానికి, ఉమ్మడి జిల్లా కేంద్రానికి వెళ్లే వాహనదారులు మలుపు దగ్గరికి వెళ్లేదాకా కనిపించడం లేదు. మూలమలుపుల వద్ద ప్రమాదాల నివారణకు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని అధికారుల దృష్టికి తీసుకెళ్లినం. – బొద్దుల లక్ష్మణ్, మాజీ జెడ్పీటీసీ, జూలపల్లి

చర్యలు తీసుకోవాలి



రోడ్లలో ఉన్న మూల మలుపుల వద్ద వేగ నిరోధకాలు వేసి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలి. ఇందుకు మూలమలుపు ఉన్న చోటుకు ముందే హెచ్చరిక బోర్డులు, వేగనిరోధకాలు ఏర్పాటు చేయాలి.

– కుంట రాజేశ్వర్‌రెడ్డి, కుమ్మరికుంట



పెద్దపల్లిరూరల్: జిల్లా గ్రంథాలయంలో..



మంథని: నివాళి అర్పిస్తున్న పుట్ట మధు



రామగుండం: నివాళి అర్పిస్తున్న తహసీల్దార్



జ్యోతినగర్: మహిళా ఉపాధ్యాయులకు సన్మానం



కాల్వశ్రీరాంపూర్ ఎంఆర్‌సీ భవనంలో..



కమాన్‌పూర్‌లో..

సావిత్రిబాయి పూలే జయంతి

సుల్తానాబాద్/జూలపల్లి/రామగుండం/ధర్మారం/కమాన్‌పూర్/కాల్వశ్రీరాంపూర్/యైటింక్లయిన్ కాలనీ/ఓదెల/ఎలిగేడు/: దేశ తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే జయంతి కార్యక్రమాన్ని ప్రభుత్వం మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా పాటించాలని నిర్ణయించింది. ఈ మేరకు శుక్రవారం జిల్లావ్యాప్తంగా సావిత్రిబాయి పూలే జయంతిని అన్ని విద్యాసంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజాసంఘాలు, కాంగ్రెస్ ఆధ్వర్యంలో నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ మేరకు మహిళా ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు.

సంక్షిప్త వార్తలు

• ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడిగా వడ్డేపల్లి సరేందర్

పాలకుర్తి: మండలలోని ఎమ్మార్పీఎస్ నూతన అధ్యక్షుడిగా కన్నాలకు చెందిన వడ్డేపల్లి సరేందర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక జీడీనగర్‌లో మండల ఇన్‌చార్జి పల్లెబాపు ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా గుంటూరుపల్లికి చెందిన చిలుముల ప్రశాంత్, పాలకుర్తికి చెందిన బూడిద అనిల్‌కుమార్, బసంత్‌నగర్‌కు చెందిన కచ్చపాక రవిరాజ్, ప్రధాన కార్యదర్శిగా జీడీనగర్‌కు చెందిన కచ్చపాక భాస్కర్, కార్యదర్శిగా కన్నాలకు చెందిన కన్నం సాయిలు, అధికార ప్రతినిధిగా ఈసాలతక్కళ్లపల్లికి చెందిన నలిగంటి శ్యాంకుమార్, సలహాదారులుగా కన్నం లక్ష్మణ్, నెరువట్ల రాయలింగు ఎన్నికయ్యారు. జిల్లా నాయకులు రాంచందర్, చందు, రాంచరణ్, సతీశ్, రవితేజ, కనుకయ్య, సతీశ్, శంకర్, నగేశ్ పాల్గొన్నారు.

• రత్నాపూర్ పేరును కొనసాగించాలి

రామగిరి: గతంలో రత్నాపూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఉన్న రత్నాపూర్‌ను అదే పేరుతో కొనసాగించాలని గ్రామ మాజీ సర్పంచ్ పల్లె ప్రతిమ పీవీ రావు శుక్రవారం జిల్లా సహకార అధికారి శ్రీమాలకు వినతిపత్రం అందజేశారు. గతంలో ఉన్న రత్నాపూర్ సహకార సంఘాన్ని కమాన్‌పూర్‌లో కలిపారని, తిరిగి రామగిరి మండలంలో ఏర్పాటు చేస్తున్న సహకార సంఘానికి రత్నాపూర్ పేరుతో కొనసాగించాలని వినతి పత్రంలో పేర్కొన్నారు.

• గురుకుల విద్యార్థులకు అవగాహన

గోదావరిఖనిటౌన్: స్థానిక రమేశ్‌నగర్‌లోని మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలోని విద్యార్థులకు శుక్రవారం షీటీంపై అవగాహన సదస్సు నిర్వహించారు. షీటీం ఇన్‌చార్జి మల్లయ్య మాట్లాడుతూ మహిళలు, విద్యార్థినులు వేధింపులకు గురైతూ 63039 23700 నంబర్‌కు ఫోన్ చేసి సమస్య తెలపాలని సూచించారు. మహిళలు ప్రమాదాలకు గురైతే డయల్ 100కు సమాచారం అందించాలన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ పద్మ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

• చెరువు శిఖం భూములను పరిరక్షించాలి

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని పందిల్లలో దూసకుంట చెరువు శిఖం భూములను, ఆక్రమణకు గురైన శిఖం భూములను పరిరక్షించాలని గ్రామానికి చెందిన కొజు కుమారస్వామి కలెక్టర్‌కు శుక్రవారం ఫిర్యాదు చేశాడు. 185 సర్వే నంబరులో 43.08 ఎకరాల విస్తీర్ణం శిఖం భూములు ఉన్నాయని, ప్రస్తుతం ఆక్రమణకు గురైన దూసకుంట చెరువు ఆనవాళ్లు కోల్పోతోందని ఆవేదన వ్యక్తం చేశాడు. భూఆక్రమణపై విచారణ చేపట్టి, సర్వే చేసి తగు చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశాడు.

• కొత్తగా సహకార సంఘాలు ఏర్పాటు చేయాలి

మంథని: మండలంలోని గుంజపడుగు, వెంకటపూర్‌లో కొత్తగా సహకార సంఘాలు ఏర్పాటు చేయాలని కోరుతూ శుక్రవారం డీసీవో శ్రీమాలకు మంథని పీఏసీఎస్ చైర్మన్ కొత్త శ్రీనివాస్ వినతిపత్రం అందజేశారు. కొత్తగా సంఘాలు ఏర్పాటు చేస్తే రైతులకు అందుబాటులో సేవలు అందుతాయని వినతిపత్రంలో పేర్కొన్నారు.

• పరామర్శ

ధర్మారం: మండల కేంద్రానికి చెందిన జర్నలిస్టు దేవి రాజమల్లయ్య కుమారుడు దేవి సిద్దార్థ రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. శుక్రవారం మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ వారిని పరామర్శించారు. సర్పంచుల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు జితేందర్‌రావు, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి కూరపాటి శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

• కూడలి సుందరీకరణకు రోడ్డు విస్తరణ

సుల్తానాబాద్: ప్రధాన చౌరస్తా కూడలిలో రోడ్డు విస్తరణకు వ్యాపారులు, ప్రజలు సహకరించాలని టీపీవో తిరుపతమ్మ కోరారు. పట్టణంలోని కాల్వశ్రీరాంపూర్ చౌరస్తా నుంచి వెళ్లే వ్యాపార కాంప్లెక్స్‌తో పాటు ఇళ్లు తొలగించే ప్రాంతాన్ని శుక్రవారం మార్కింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు, అధికారులు మాట్లాడుతూ గట్టెపల్లి రోడ్డు వరకు 60ఫీట్ల విస్తరణతో రోడ్డు పనులకు శ్రీకారం చుట్టామని పేర్కొన్నారు.

• 5, 6 తేదీల్లో బ్లాక్ లెవల్ స్పోర్ట్స్ మీట్

సుల్తానాబాద్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో 5, 6 తేదీల్లో బ్లాక్ లెవల్ స్పోర్ట్స్ మీట్ నిర్వహించనున్నట్లు నెహ్రూ యువ కేంద్రం వలంటీర్ మహేశ్ తెలిపారు. కబడ్డీ, వాలీబాల్, బ్యాడ్మింటన్, రన్నింగ్ రేస్, షాట్‌పుట్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు రేషవేణి మహేశ్ నంబర్ 79936 04489, సత్యనారాయణ 93965 40067 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

శ్మశానంలో విద్యుత్ సమస్య పరిష్కరించండి



ఎమ్మెల్యేకు సమస్య వివరిస్తున్న నీలయ్య

సుల్తానాబాద్: మున్సిపల్ పరిధిలోని పూసాలలో ఉన్న శ్మశాన వాటికలో విద్యుత్ సమస్య తీవ్రంగా ఉందని మున్సిపల్ చైర్‌పర్సన్ గాజుల లక్ష్మి, లయన్స్ క్లబ్ జోనల్ చైర్మన్ వల్స నీలయ్య.. ఎమ్మెల్యే విజయరమణారావు దృష్టికి తీసుకువెళ్లారు. ఎలిగేడు మండలంలోని శివపల్లిలో శుక్రవారం ఎమ్మెల్యేను కలిసి సమస్య విన్నవించారు. ఎమ్మెల్యే వెంటనే విద్యుత్ అధికారులకు ఫోన్ చేసి శ్మశాన వాటికలో విద్యుత్ సమస్య లేకుండా చూడాలని ఆదేశించారు. దీంతో విద్యుత్ అధికారులు హుటాహుటిన శ్మశానవాటికకు వెళ్లి మరమ్మతు చేశారు. లయన్స్ డిస్ట్రిక్ట్ చీఫ్ కోఆర్డినేటర్, వలస నీలయ్య, ప్రెసిడెంట్ మాటేటి సంజీవ్, ఎర్రవెల్లి సుధీర్‌రావు, జూపల్లి తిరుమలరావు, గాదాసు రవి పాల్గొన్నారు.

జూలపల్లి ఎస్సైగా సనత్‌కుమార్

జూలపల్లి: జూలపల్లి ఎస్సైగా సీహెచ్ సనత్‌కుమార్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు.

'ఖని' యువకులకు జాతీయ అవార్డులు





అవార్డు అందుకుంటున్న ఇబ్రహీం, ఈదునూరి శంకర్

కోల్‌సిటీ: గోదావరిఖనికి చెందిన సామాజికవేత్త, పలు సేవా సంఘాల నిర్వాహకుడు ఈదునూరి శంకర్, ఇన్కామ్ ట్యాక్స్ ఆడిటర్ ఎండీ.ఇబ్రహీం జాతీయ అవార్డులు అందుకున్నారు. న్యూఢిల్లీలో అంబేడ్కర్ గ్లోబల్ ఫౌండేషన్ సంస్థ, ఇండియన్ గెలాక్సీ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు నిర్వహించారు. ఈదునూరి శంకర్‌కు బీఆర్ అంబేడ్కర్ భారత్ భూషణ్ అవార్డు, ఇబ్రహీంకు అంబేడ్కర్ నేషనల్ సోషల్ సర్వీస్ ఎక్స్‌లెన్సీ అవార్డు అందించారు.



సుల్తానాబాద్‌రూరల్: రేషన్ బియ్యం కొంటాం.. బియ్యం కొంటాం అని వాయిస్ రికార్డుతో ఆటోలో తిరుగుతూ కార్డుదారుల నుంచి రేషన్ బియ్యం సేకరిస్తున్నారు. ఇదంతా బహిరంగంగానే జరుగుతున్నప్పటికీ అధికారులు పట్టించుకోకపోవడంపై స్థానికంగా విమర్శలు వినవస్తున్నాయి.

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 97053 46608, 98499 71500

సింగరేణి వార్తలు

ఆర్జీ–3 పరిధిలోని సమస్యలు పరిష్కరిస్తాం



సమావేశంలో పాల్గొన్న అధికారులు, సంఘాల ప్రతినిధులు

రామగిరి: ఆర్జీ–3 ఏరియా గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల ప్రతినిధులతో శుక్రవారం సెంటనరీకాలనీలోని రామగిరి అతిథి గృహంలో ఆర్జీ–3, ఏపీఏ జీఎంలు సుధాకర్‌రావు, వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఏరియా స్థాయి నిర్మాణాత్మక సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆర్జీ–3 పరిధిలోని సమస్యలపై చర్చించారు. రోడ్లు, లైటింగ్, కార్మికుల సమస్యలు, తాగునీటి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అధికారులు మాట్లాడుతూ ఆర్జీ–3 ఏరియా పరిధిలో ఉన్న సమస్యలను సంబంధిత అధికారుల నుంచి వివరాలు సేకరించి సమస్యలు పరిష్కరించడానికి కృషి చేస్తామన్నారు. కార్పొరేట్ పరిధిలో ఉన్న సమస్యలను సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని పేర్కొన్నారు. సమావేశంలో వైవీ.రావు, రాంచంద్రరెడ్డి, కోట రవీందర్ రెడ్డి, డీ.టీ.రావు, విజయ్‌రాఘవ, భాస్కర్‌రావు, తిరుపతి, రామారావు, సాయికృష్ణ, అధికారులు శేఖరబాబు, రఘుపతి, శ్రీనివాసులు, నాగేశ్వర రావు, వెంకటరమణ పాల్గొన్నారు.

9న తెలంగాణ తల్లి విగ్రహానికి భూమిపూజ



మట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు

రామగిరి: మండలంలోని సెంటినరీకాలనీ తెలంగాణ చౌరస్తాలో ఈనెల 9న ఉద్యమ తెలంగాణ తల్లి విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ కార్యక్రమం నిర్వహించనున్నట్లు మాజీ ఎమ్మెల్యే పుట్టమధు అన్నారు. శుక్రవారం ఆయన సాయిగార్డెన్స్‌లో రామగిరి బీఆర్‌ఎస్ కార్యకర్తలతో సమావేశమయ్యారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. తెలంగాణ తల్లి విగ్రహ భూమిపూజ కార్యక్రమానికి ఎమ్మెల్సీ, జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. మండలంలోని అన్ని గ్రామాల పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

విద్యార్థులకు ఇంగ్లిష్ ఒలింపియాడ్ పోటీలు



గోదావరిఖనిటౌన్: బహుమతి అందజేస్తున్న ఎంఈవో



ముత్తారం: పోటీలు ప్రారంభిస్తున్న ఎంఈవో

గోదావరిఖనిటౌన్: ఇంగ్లిష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మండలస్థాయి ఇంగ్లిష్ ఒలింపియాడ్ రాతపరీక్ష, ఉపన్యాస పోటీలు 8, 9వ తరగతి విద్యార్థులకు శుక్రవారం స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ప్రారంభించినట్లు ఎల్టా జిల్లా వ్యవస్థాపకుడు గడ్డం జగదీశ్వర్ తెలిపారు. రామగుండం మండల విద్యాధికారి జి.చంద్రయ్య, హెచ్‌ఎం మల్లేషం విజేతలకు బహుమతులు అందజేశారు. ఎంపికైన విద్యార్థులకు 18న జిల్లాపోటీలు, 31న రాష్ట్ర పోటీలు నిర్వహించనున్నట్లు జగదీశ్వర్ పేర్కొన్నారు.

విజేతలకు సర్టిఫికెట్ల ప్రదానం



జూలపల్లి: విజేతలకు సర్టిఫికెట్లు ప్రదానం

జూలపల్లి: మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఇంగ్లిష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఒలింపియాడ్, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. విజేతలకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఎల్టా కన్వీనర్ వీరమల్లు, కోకన్వీనర్ మాధవి, ఉపాధ్యాయులు అశోక్, అంజయ్య, హరీశ్, గణేశ్, రజిత ఉన్నారు.

విద్యార్థుల ప్రతిభ

ముత్తారం: ముత్తారంలో ఆంగ్ల ఒలింపియాడ్ మండల స్థాయి పోటీలను శుక్రవారం ఎంఈవో ఓదెలు ప్రారంభించారు. ప్రతిభ చూపిన విద్యార్థులను ఎంఈవో, ఉపాధ్యాయులు అభినందించారు. హెచ్‌ఎంలు పద్మావతి, ఉపాధ్యాయులు రాజ్‌కుమార్, రవి, సహేద్ పాల్గొన్నారు.

అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి

జ్యోతినగర్: బీఆర్ అంబేడ్కర్‌పై పార్లమెంట్ సమావేశాల్లో అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంమంత్రి అమిత్ షాను వెంటనే కేంద్ర మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.భిక్షపతి డిమాండ్ చేశారు. ఎన్టీపీసీ రామగుండం మేడిపల్లి సెంటర్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం కరపత్రాలను పంపిణీ చేశారు. సమావేశంలో ఎన్టీపీసీ రామగుండం ఏరియా కమిటీ కన్వీనర్ గీట్ల లక్ష్మారెడ్డి, శివప్రసాద్, రవికాంత్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు ఫిర్యాదు

రామగిరి: మండలంలోని నాగేపల్లిలో ప్లాట్లు అమ్ముకున్న వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామ మాజీ సర్పంచ్ కొండవేన ఓదెలు, బీఆర్‌ఎస్ నాయకుడు శంకర్ శుక్రవారం కలెక్టర్, డీపీవోలకు ఫిర్యాదు చేశారు. గ్రామానికి చెందిన కొంతమంది అక్రమంగా ప్లాట్లు అమ్ముకోవడంతో పాటు కొన్ని ప్లాట్లు దుర్వినియోగం చేశారని ఆరోపించారు. విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

అయ్యప్ప ఆలయంలో పూజలు

పెద్దపల్లిరూరల్: పట్టణంలోని అయ్యప్ప ఆలయంలో శుక్రవారం దీక్షాపరులు ప్రత్యేక పూజలు చేశారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
పెద్దపల్లి జిల్లా :
9951602934
Office mail : knrjagati@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
పెద్దపల్లి : కె.తిరుపతి, ACO - 7997958206
పెద్దపల్లి : ఎం.మహేందర్, SR - 9573331940
మంథని : రాజేశ్ - 9676603963
రామగుండం : ప్రశాంత్ - 9652397696
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899